ఎల్ ఆర్ ఎస్‌పై కాంగ్రెస్ దగా

లిబర్టీలోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ శ్రేణులు

హిమాయత్‌నగర్, మార్చి 6: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజలపై అధిక భారాన్ని మోపేందుకు సిద్ధమైందని తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీలు ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు తీసుకోకుండా ఎల్ఆర్ఎస్ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో లిబర్టీలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డమైన హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే నిజస్వరూపం బయటపడిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన మంచి పనులను తామే చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గతంలో ఎల్ఆర్ఎస్‌ను వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఎలా అమలు చేస్తుందని సూటిగా ప్రశ్నించారు. ఖజానా నింపుకొనేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం ఆపే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్య గౌడ్, దేదిప్యరావు, పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్‌రెడ్డి, జైసింహ, అనీశ్ గంగపుత్ర, రూపేశ్ యాదవ్, అశీశ్ యాదవ్, దూసరి శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్ ముదిరాజ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్సస్‌లో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో ఈనెల 8, 9, 10న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా కస్టమర్లకు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షాపింగ్‌కు వచ్చే ప్రతీ మహిళకు విభిన్న రకాల పూలతో స్వాగతం పలికి వారి కోసం ఆర్ట్స్, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వారు ఆరోగ్యంగా ఉండేల యోగాపై ప్రత్యేక అవగాహన కల్పించడానికి కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జానపద నృత్యాలు, లైవ్ డ్యాన్స్, జుంబా డ్యాన్స్ సెషన్స్ ఉంటాయని వివరించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

వెంగళరావునగర్, మార్చి 6: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మార్వో నయీముద్దీన్ బుధవారం పంపిణీ చేశారు. వెంగళరావునగర్ డివిజన్‌కు సంబంధించిన 12 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, యూసుఫ్‌గూడ కార్పొరేటరర్ రాజ్‌కుమార్ పటేల్‌వేణు, కట్ట లక్ష్మి, యాదగిరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేతలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలు.. పరిశీలించిన ఎమ్మెల్యే గోపీనాథ్

ఎర్రగడ్డ, మార్చి 6: బోరబండ డివిజన్ వీకర్‌సెక్షన్‌లో అక్రమ నిర్మాణాలంటూ బల్దియా అధికారులు మంగళవారం నాలుగు చిన్న చిన్న దుకాణాలను కూల్చేశారు. ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో బాధితులు వాపోయారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను కూల్చేశారని గోపీనాథ్‌కు వివరించారు. పూట గడవటం కోసం పేదలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటుంటే.. వారిపై ఇలాంటి చర్యలు తగవంటూ మాగంటి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నేతలు విజయకుమార్, ఎండీ యూసుఫ్ తదితరులున్నారు. అనంతరం ఎమ్మెల్సీ ప్రభాకర్‌తో కలిసి బల్దియా కమిషనర్‌ను కలిసి కూల్చివేతల గురించి వివరించారు.

ఫార్మా లో ఉపాధి అవకాశాలు

బంజారాహిల్స్, మార్చి 6: ఇప్పటికే భారతదేశంలో ఫార్మారంగంలో అగ్రగామిగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రానున్న రోజుల్లో మరింత పురోగతి ఉంటుందని ఫార్మస్యుటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజా భాను అన్నారు. జాతీయ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాదటు చేసిన 'ఫార్మా అన్వేషణ్- 2024' సదస్సులో రాజా భాను మాట్లాడుతూ.. భారత్‌లో ఉత్పత్తి అవుతున్న పార్మా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, రానున్న రోజుల్లో ఈ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఫార్మసీ విద్యార్థులు తమలోని నైపుణ్యతలను పెంచుకోవాలని సూచించారు. జాతీయ విద్యా విధానాన్ని ఫార్మసీ విద్యలో ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని, దీనిలో భాగంగా సరికొత్త డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నామని పార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎం.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. టి.సుమాలిని, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి. ఫార్మసీ కళాశాల ప్రిన్స్‌పల్ డా. అనుపమ కోనేరు పాల్గొన్నారు.

ఫార్మా అన్వేషణ్ -2024 సదస్సులో పాల్గొన్న రాజా భానుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

జీతాలు చెల్లించాలని సీఎంకు లేఖ

హిమాయత్‌నగర్, మార్చి 6: రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్(ఎన్.హెచ్ఎం) స్కీం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 17వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారని, వీరికి 3 నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి సాంబశివ రావు లేఖ రాశారు. జిల్లా స్థాయి, పీహెచ్‌సీ, సబ్ సెంటర్, బస్తీ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం సేవలు అందిస్తున్నారని, వీరికి ప్రతినెల ఒకటో తేదీన అందాల్సిన వేతనాలు మూడు నెలలైనా అందకపోవటంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎన్.హెచ్ఎం స్కీం కింద పనిచేసే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

దాతల సహకారం హర్షణీయం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 6: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులకు దర్వాజాలు, కిటికీలు శిథిలావస్థకు చేరాయన్నారు. నవ యువ యూత్ క్లబ్ చొరవతో దుర్గానగర్‌కు చెందిన కోతవల్ నరిహరి సహకారంతో బుధవారం పది దర్వాజాలు, 20 కిటికీలు తమ సొంత నిధులతో ఏర్పాటు చేయించామన్నారు. మావనవ సేవయే మాధవ సేవ అనే భావంతో ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించిన కొతవాల్ నరిహరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్, పల్లపు జగన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని యాచకుడు మృతి

దుండిగల్,మార్చి6: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ యాచకుడికి తీవ్రగాయాలు కాగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 17న బాచుపల్లి రెడ్డి ల్యాబ్ ఎదురుగా గుర్తు ఓ మూగ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

శంషాబాద్ రూరల్, మార్చి 6: గ్రామాల అభివృద్ధికి చర్యల తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్ డీఈ సంజీవరెడ్డి తెలిపారు. గురువారం శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామంలో సీసీరోడ్డు వేయడానికి రూ.15 లక్షలు మంజూరు కావడంతో స్థానిక నాయకులు నీరటి రాజుముదిరాజ్, ఎంపీటీసీ గౌతమి, ఎంపీవో ఉషకిరణ్‌తో కలిసి ఆయా రోడ్లును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నర్కూడ గ్రామంలో సీసీరోడ్డు వేయడం కోసం నిధులు మంజూరు కావడంతో రోడ్డు వేసే ప్రాంతాలను పరిశీలించి రోడ్డు వేయానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు నీరటి రాజుముదిరాజ్ మాట్లాడుతూ.. నర్కూడ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం కోసం రూ.15 లక్షల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పనులు పరిశీలించిన వారిలో నాయకులు ఎస్.శ్రీనివాస్, అశోక్ ముదిరాజ్, తొంట అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఆయుష్ వైద్యుల పోస్టుల ఫలితాలు వెంటనే విడదల చేయాలి

వెంగళరావునగర్, మార్చి 6: ఆయుష్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఫలితాలు వెంటనే విడుదల చేయాలని ఆయుష్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బుధవారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట ఆయుష్ వైద్యుల నిరసన తెలిపారు. 10 వేల మంది ఆయుష్ వైద్యులు గడిచిన 9 నెలలుగా ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారని వాపోయారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పలుమార్లు కలిసినా జాప్యం జరుగుతోందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఆయుష్ పోస్టుల ఫలితాలు విడుదల చేసి.. వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

మాట్లాడుతున్న డీడీ ఇండస్ట్రీస్ యాదయ్య తదితరులు

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 6: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలున్నాయని, ఎస్సీ, ఎస్టీలకు మరిన్ని అవకాశాలున్నాయని రంగారెడ్డి జిల్లా పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ యాదయ్య అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ ఫుడ్ ప్రాసెస్ యూనిట్లపై అవగాహణ సదస్సు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్సీ యువతకు మహిళలకు 45 శాతం, పురుషులకు 35 శాతంపై రూ.19 లక్షల వరకు సబ్సీడీ ఉంటుందన్నారు. పరిశ్రమలు, వాహనాలు, కొనుగోలు ఎంతో మంది ఉపాధి పొందుతున్నారన్నారు. తెలంగాణ ప్రతి జిల్లాలో డీఐజీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 20 శాతం యువత ఆయా కంపెనీలకు, వాహనాలకు యజమానులుగా పలువురికి ఉపాధి కల్పిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. నాబార్డ్ మేజేజింగ్ డైరెక్టర్ కోటయ్య మాట్లాడుతూ.. యువత నిరుత్సహ పడాల్సిన అవసరం లేదని.. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ సహకారం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఐ జీఎం సురేశ్, నాయుడు, సత్యవతి, రామ నివాస్ గుప్తా తదితరులు పాల్గొని యువతకు పలు సూచనలు ఇచ్చారు.

ఆ చిత్రాలు 'ఆమె'కు అంకితం

మహిళా ఆటోడ్రైవర్ అరుణను సత్కరిస్తున్న డాక్టర్ వెన్నల, యశోద, లలితాదాస్ తదితరులు

ఖైరతాబాద్, మార్చి 6 : సమాజంలో మహిళ పడుతున్న కష్టాలు.. ఎదుర్కొంటున్న అవరోదాలు.. వాటి పరిష్కారాలపై అవగాహన కల్పిస్తూ ప్రముఖ ఆర్టిస్ట్ లలితాదాస్ వేసిన చిత్రాలు ఆలోచింపజేశాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమెన్ టుడే పబ్లికేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా లలితాదాస్ కుంచె నుంచి జాలు వారిన పలు అద్భుత చిత్రాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను ముఖ్య అతిథులుగా హాజరైన గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నల, మహిళా కమిషన్ మాజీ కార్యదర్శి సరళా రాజ్యలక్ష్మి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయా రెడ్డి, సీనియర్ మహిళా జర్నలిస్టు యశోదతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్రకారిణి లలితాదాస్ మాట్లాడుతూ.. మహిళలపై వరకట్న, లైంగిక వేధింపులే కాదని, ఇంకా సమాజంలో అనేక రకాల వేధింపులు, దౌర్జన్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే అమీర్‌పేట మెట్రో స్టేషన్, ఆర్టీసీ డిపోలలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రతి పాఠశాలలో ప్రదర్శిస్తామని తెలిపారు. అనంతరం మహిళా ఆటోడ్రైవర్ అరుణను అతిథులు సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామాయణ గాథను వివరిస్తూ ఆర్టిస్ట్ అపర్ణ కనుమూరి ఎంబ్రాయిడరీతో వేసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో డర్మటాలజిస్ట్ డాక్టర్ హరిణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిస్ట్ లలితా దాస్ వేసిన చిత్రాలు

స్పా ముసుగులో వ్యభిచారం

● నిర్వాహకులపై కేసు నమోదు

బంజారాహిల్స్, మార్చి 6: నిబంధనలకు విరుద్ధంగా స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని రిలయన్స్ క్లాసిక్ బిల్డింగ్స్‌లోని నాలుగో ఫ్లోర్‌లో ముగ్గురు యువతులు కలిసి లక్కీ బ్యూటీ అండ్ ఫ్యామిలీ స్పా పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఎలాంటి నిబంధనలు పాటించకపోవడంతో పాటు క్రాస్ మసాజ్‌తో పాటు వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. స్పా యజమాని పరారీలో ఉన్నాడు. గదుల్లో ఉన్న ముగ్గురు కస్టమర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు.. వారిని అరెస్టు చేశారు. క్రాస్ మసాజ్, వ్యభిచారం చేస్తున్న ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకుని.. రెస్క్యూ హోంకు తరలించారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తొండుపల్లిలో గోదాంలో అగ్ని ప్రమాదం

శంషాబాద్ రూరల్, మార్చి 6: శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లిలోని ఓ గోదాంలో అగ్ని ప్రమాదం బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండుపల్లి వద్ద శ్రీలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో పెళ్లిమండపాల డెకరేషన్ గోదాం నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే గోదాంలో ఉన్న డెకరేషన్ సామగ్రి కొంతమేరకు దగ్ధమైన్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి

శంషాబాద్ రూరల్, మార్చి 6: అమ్మపల్లి రెవెన్యూ పరిధిలోని భూములను కబ్జాల నుంచి రక్షించాలని కోరుతూ గురువారం నర్కూడ గ్రామస్తులు గుండాల విశ్వనాథం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 19/17,19/21,19/24,19/23 లలోని భూములోకి కొందరు అక్రమార్కులు చొరబడి భూములను ఆక్రమించడంతో పాటు నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. శంషాబాద్ మండలం, శంషాబాద్ మున్సిపాలిటీకి సరిహద్దు కావడంతో మున్సిపాలిటీకి సంబంధించిన సర్వే నంబర్లు వేసి ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేసుకొని నిర్మాణలు చేపడుతున్నట్లు వివరించారు. కొంతమంది తమ ప్లాట్లుగా చెప్పుకుంటు దుకాణాలు ఏర్పాటు చేసి దర్జాగా కబ్జా చేస్తున్న ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే ఫిర్యాదు చేశామని చెప్పారు. శంషాబాద్-షాబాద్ రోడ్డుకు ఇరువైపులా విలువైన భూములను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బల్వంత్, ప్రభు, ప్రభాకర్ ఉన్నారు.

తాసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పత్రాలను చూపుతున్న నర్కూడ గ్రామస్తులు

కబ్జాకు యత్నం.. చర్యలు తీసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 6: ఆరాంఘర్ చౌరస్తాలోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని శిక్షించాలని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాటేదాన్ విలేజ్ సర్వే నంబర్ 54,55,56లలో మొత్తం 16 ఎకరాల 20 గుంటల భూమి ఉందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. ఆరాంఘర్ చౌరస్తాలోని 7 ఎకరాల 22 గుంటల భూమిలో ప్రభుత్వం రాష్ట్ర మినీ బస్ టర్మినల్ బస్‌స్టాండ్ నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. కానీ అది కార్యరూపం దాల్చకపోవడంతో కొందరు వ్యక్తులు సర్వే నంబర్ 55లోని 4 ఎకరాల 24 గుంటల భూమి తమదంటూ బహిరంగ మార్కెట్‌లో అమ్ముతున్నారని, 65 వేలకు గజం చొప్పున విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి తగిన గుణపాటం చెప్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వెంటనే ఆరాంఘర్ చౌరస్తాలో అంతరాష్ట్ర మినీ బస్ టర్మినల్ బస్‌స్టాండ్ నిర్మించాలని కోరారు. కబ్జాలకు ప్రయత్నిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హ్యాండ్ బ్యాగ్‌లో దాచిన.. బంగారు గొలుసులు మాయం

వెంగళరావునగర్, మార్చి 6 : హ్యాండ్ బ్యాగ్‌లోని పౌచ్‌లో దాచిన రెండు బంగారు నెక్లెస్ గొలుసులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై సెక్రటరియట్ పోలీసులు జీరో ఎఫ్ ఐఆర్ నమోదు చేసి, మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీకి చెందిన ఎన్.సుధ హ్యాండ్ బ్యాగ్‌తో జనవరి 9న ఓ శుభ కార్యక్రమం నిమిత్తం భీమవరం వెళ్లారు. జనవరి 20న తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. అయితే, బంగారు ఆభరణాలు హ్యాండ్ బ్యాగ్‌లోనే ఉండిపోయాయి. ఫిబ్రవరి 4న మధ్యాహ్నం తన స్నేహితురాలు శ్యామలతో కలిసి నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ప్లాంట్ ఎగ్జిబిషన్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి తన హ్యాండ్ బ్యాగ్ తెరిచి చూడగా.. అందులో దాచిన 75 గ్రాముల రెండు బంగారు నెక్లెస్‌లు కనిపించలేదు. బాధితురాలు సుధ ఫిర్యాదు మేరకు సెక్రటరియట్ పోలీసులు తొలుత జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఇంటి వద్ద నుంచే బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించి.. కేసు తదుపరి విచారణ నిమిత్తం మధురానగర్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు మధురాగనర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ ఫోన్ స్నాచింగ్

వెంగళరావునగర్, మార్చి 6: సొంతూరుకి వెళ్లేందుకు బస్సు కోసం నిరీక్షిస్తున్న ఓ వ్యక్తి చేతిలో నుంచి దుండగుడు సెల్‌ఫోన్ లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన బండి ప్రశాంత్ కూకట్‌పల్లి సమీపంలోని ఇందిరాహిల్స్‌లో ఉంటున్నాడు. స్వగ్రామం వెళ్లేందుకు మంగళవారం తెల్లవారు జామున అమీర్‌పేటలోని మైత్రీ వనం వద్ద బస్సు కోసం నిరీక్షిస్తుండగా.. వైట్ కలర్ యాక్టీవా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతకుడు.. అతడి చేతిలో ఉన్న సెల్ ఫోన్‌ను లాక్కొని ఉడాయించాడు. బాధితుడు ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బ్యాటరీ దొంగ అరెస్టు

ఖైరతాబాద్, మార్చి 6 : ఐస్‌క్రీమ్ బండ్లలోని బ్యాటరీని తస్కరించేందుకు యత్నించిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...దూల్‌పేటకు చెందిన ప్రకాశ్ (19) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.మంగళవారం అర్ధరాత్రి ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా పార్కు చేసిన ఉన్న పలు ఐస్ వాహనాలకు సంబంధించిన బ్యాటరీను దొంగతనం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

వేసవికి ముందే నీటి గోస

మణికొండ, మార్చి 6: వేసవికి ముందే మణికొండ జలమండలి కార్యాలయం పరిధిలో నీటి సమస్య తీవ్రతరమైంది. అరకొర నీటి సరఫరాతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. సక్రమంగా నీటి సరఫరా చేయాలని జలమండలి కార్యాలయాన్ని సంప్రదిస్తే అధికారులు పొంతనలేని సమాధానం చెబుతూ దాటవేస్తున్నారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. సక్రమంగా నీటి సరఫరా జరగనప్పటికీ వేలల్లో మాత్రం బిల్లులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టాయిలెట్లను అందుబాటులో త